

# సీతాబిరాట్టి

‘‘బిరాట్టునూ బిరాట్టియూ’’ అని పురాణం చెప్పే నరహరి శాస్త్రి ఆనాడు పురాణ శ్రవణం మొదలెట్టాడు. సాయంకాలం నాలుగూ ఆరూ మధ్య చెప్తాడు. ఒక్కోరోజు పర్వదినం నాడు మధ్యాహ్నం రెండింటికి మొదలెట్టి నాలుగింటికి ముగించేస్తాడు. వారింటి పేరే పురాణం వారు. ఇప్పటికి అయిదు తరాలనించీ గుళ్లో మంటపంలో రసవత్తరంగా పురాణాలు వినిపించి, భక్తులను మెప్పిస్తూ వస్తున్నారు. క్రమంగా అసలు యింటిపేరు మరుగునపడిపోయి పురాణం శాస్త్రుర్లు అనేదే స్థిరపడింది.

శ్రోతలలో ఒకామెకి అర్థంగాలేదు.

‘‘అంటే యెవరు శాస్త్రిగారూ నా కర్థంగాలేదు? సులభశైలిలో చెప్తారా?’’ అన్నది నిలబడి. ఆమెపేరు సరోజినమ్మ. అందరికీ చివరన వున్నది.

అడుగుతున్నదెవరోనని తలెత్తి చూశాడు శాస్త్రిగారు. కొత్త ముఖం. కాని తెలిసిన మనిషిలాగా పిలుస్తున్నది. చనువుగా అడుగుతున్నది. చిత్రం! అనుకున్నాడు. సనాతనుని వేషం. వ్యాసపీఠం మీద రామాయణం ఓపెన్‌చేసి వున్నది. ఆనాడు వివరించబోయే సర్గ మీద పట్టుతాడున్నది. బిగించిన దట్టీ. జంధ్యం మీదుగా రుద్రాక్షల తావళం కొలికి పూస పెద్దదీ బంగారు తీగతోనే చుట్టబడింది. ఆయన పక్కగా యెత్తు తక్కువ పీట స్తంభం దగ్గరగా వున్నది. దానిమీద శ్రీరామ పట్టాభిషేక పఠమున్నది. దాని ముందు పళ్లెం. దీపారాధనా. వెలుగుతూ సువాసనలు వదుల్తున్న పూదొత్తుల గిన్నె.

‘‘కూచోమ్మా. నించోక్కర్లేదు. అడిగినది మీరే అయినా యింకా తెలియని వారుండచ్చు. వారికీ అర్థం అవుతుంది. చెపుతాను. విరాట్‌పురుషుడు అనే పదం వినే వుంటారు. అలాగే ములాధారా, పరాశక్తీ అనే పదాలు గూడా వినే వుంటారు మీరంతా. అంటే అంతటా నిండి వుండి ప్రాణికోటిని కాపాడుతూ, జీవశక్తిని నశించకుండా కనిపెట్టి చూసే పరమేశ్వరి అని అర్థం. శ్రీరాముడు విరాట్

పురుషుడైతే, సీతామహాదేవి మూలాధార అని అర్థం. విరాట్ అనే పదాన్ని బిరాట్ బిరాట్టీ అంటారు. అలాగే విష్ణు, రుక్మిణీ అనేవి పలకటం కష్టమై విఠ్ఠ, విఠలా, శుకుమాబాయీ అంటారు. హరియే విఠలుడు. శిష్య అనే పదం రూపాంతరం చెంది సిఖ్, సిక్ అయింది. అవినాశి అంటే గూడా విరాట్ పురుషుడే. అంటే యెన్ని ప్రకృతి వైపరీత్యాలు వచ్చినా, జీవరాశి నశించదు. కొద్దిగా మిగిలే వుంటుంది. అది మళ్లా వృద్ధి జెందుతుంది.

మనం కొన్ని వందల యేళ్ల క్రితం పరపాలనలో మగ్గుతూ కాటకం, క్షామం, అంటువ్యాధులూ, అతి వృష్టీ అనా వృష్టీ వంటి వాటికి గురిఔతూ ముప్పై కోట్లకు తగ్గిపోయినాము. కాని నేడు వైద్యం అభివృద్ధి జెందింది. రవాణా సౌకర్యాలు వృద్ధి జెందాయి. నేడు మనం యెనభై కోట్ల వరకు వృద్ధి జెందామటున్నారు జనాభా లెక్కలు సేకరించేవారు'' అన్నాడు నిదానంగా.

''చాదస్తంగా వివరిస్తాడు శాస్త్రి. ముక్కస్య ముక్కార్థం చెపితే సరిపోదూ?'' అనుకున్నాడు రామయ్య పెద్ద కాపు.

''మీ దేముడు నీలంగా యెందుకుంటాడని, తెల్లజాతి ఆచార్యుడడిగితే, 'సర్వవ్యాపి, విశ్వవ్యాపి అని చెప్పటానికి అలా నీలిదేవుడిని చూపుతారని మన పండితుడు ఒక్క ముక్కలో చెప్పాడట'.

తరవాత పురాణం సాగిపోయింది అడ్డు ప్రశ్నలేకుండా.

2

సీతా బిరాట్టికి ఓట్లు వేయించగల స్తోమత వున్నది. అంగబలం, అర్థబలం శరీరదారుఢ్యం వుండటమే ఆ స్తోమతకి కారణం. నిండైన విగ్రహం, పసిమి, చేతులు కబంధ హస్తాలల్లే పవర్‌ఫుల్.

భర్త దాశరథి కౌమారం దాటి, అశక్తుడై, అసమర్థుడు కూడా కాగానే పగ్గాలు సీతాబిరాట్టి పట్టుకున్నది. చదువు చిన్నదేగాని రాజకీయ దురంధర. నోరూ చెయ్యీ జాడిస్తూ, గృహనిర్వహణా, బంధువుల నాకట్టుకురావటం

అవలీలగా చేస్తున్నది. కుటుంబ సభ్యులనందరినీ ఒక్కతాటిమీద నడిపిస్తున్నది.

అట్టి సీతాబిరాట్టి పుత్రరత్నం, వెరపనేది యెరుగక, తల్లి పవర్‌ఫుల్ అని తెలిసినా, తన వ్యక్తి గత విషయాలు తానే చూసుకుంటూ, బైటపడకుండా శాసన సభ్యత్వం వెలిగిస్తున్నాడు. మరీ రాజకీయాలతో తల దిమ్మెక్కకుండా, ఒకటే తిరుగుడూ పార్టీక్రమాలతో విసుగెత్తకుండా, తిండి వేళకమరదు, అమిరినా రుచీ పచీ వుండదు. యీ యాతనలకు మందు కనిబెట్టాడు పుత్రరత్నం. సొలేస్ కోసం, రిలీఫ్ కోసం, గృహస్తు అయినాడు. మధురానుభూతిని నెమరు వేస్తాడు. స్త్రీ యిచ్చిన లలితమైన ప్రేమను పొంది, పార్టీని పటిష్ఠం చేస్తున్నాడు.

సీతాబిరాట్టికి, తన పుత్రరత్నం పార్టీకి విరుద్ధంగా నడుస్తున్నాడని గట్టి వార్తలే అందినాయి.

''మీరే పార్టీ విప్! మేడమ్! పార్టీకి విరుద్ధంగా ప్రవర్తించే వారి మీద చర్య తీసుకునే అధికారం మీకున్నదమ్మగారూ! పార్టీ నుండి బహిష్కరించవచ్చు. తిట్టచ్చు. శత్రుపక్షంతో చేతులు కలిపి నన్ను దింపేయాలని చూస్తున్నావని దూషించవచ్చు. అధికారం వాడుకోరూ?'' అని కుడిభుజం వంటి పార్టీ వర్కర్ రెచ్చగొట్టాడు సీతాబిరాట్టిని.

బిరాట్టి పార్టీలో చంచాగిరీ చేసే సభ్యులున్నారు. బిరాట్టికి ఆవేశం కలుగుతున్నదని గమనించాడు.

''మీ దత్తాత్రేయ పుత్రరత్నం, మరో పార్టీ వర్కర్ వేపు వాళ్లందరికీ హెల్పుఫుల్‌గా వుండి, వారి కనీస కోర్కెలు తీరేట్టు చూడటమే గాక, వారు మితిమీరి డిమాండ్ చేసేవిగూడా, అసాధ్యమని తెలిసి గూడా ట్రై చేస్తున్నాడు. మన పార్టీని చీల్చాలని చీలికలు తేవాలని చూస్తున్నట్టు అర్థమౌతున్నది దత్తామాటల వల్ల. కొంత బలగం చేరాక దత్తా డిసిడెంటుగా తయారై గొంతెమ్మ కోర్కెలు కోరచ్చు. ఇప్పుడే అణిచివేయాలి మేడమ్. మద్దతిచ్చేవారి సంఖ్య పెరగగానే, లీడర్నని, ప్రెసిడెంటునని అనచ్చు. అప్పుడు మరీ కష్టం. పార్టీ అన్న తరవాత చీలికలు తప్పవు. పుర్రెకో బుద్ధి అన్నారు. మహా మహా పార్టీలే చీలాయి. ఇప్పుడే

మీ పవర్ వాడి, ఆధిపత్యం నిలబెట్టుకోవాలి మేడమ్!'' అగ్నిలో ఆజ్యం పోసినట్టు ఆమె ఆవేశాన్ని ప్రజ్వలింపచేశాడు గిరీ.

మందులు పనిచేసినట్టు ఆశ్రితుల మాటలు పనిచేసినై. నేరాలూ పనిచేసినై. దత్తాత్రేయ అందగానే వింటున్నాడని గమనించి అన్నది బిరాట్టి.

''నీకు మరో పార్టీ పెట్టుకునే అధికారం లేదు దత్తా! దాన్ని నడపనూ లేవు. మోసపోతావు. అన్ని మనస్తత్త్వాల వారినీ మతంలో కలుపుకుంటే మతం పాడై పతనం చెందినట్టు, అందర్నీ పార్టీ సభ్యులుగా చేస్తివా పార్టీకి అప్రతిష్ఠ చుట్టుకుంటుంది. పార్టీకి విరుద్ధమైన పనులు చేస్తున్నావనీ, పార్టీని చీలదీయాలని చూస్తున్నావనీ, నీ మీద పితూరీలు లేస్తున్నాయి. ఇప్పుడే మేలుకో. చేతులు కాలాక ఆకులు పట్టుకునేవు. వున్న ఫండ్సన్నీ నా పేరే వున్నాయి. నీ చిత్తమొచ్చినట్టు డ్రా చేసి శత్రుపక్షం కోసం వాడే వీలులేదు'' అని ఘట్టిగా వార్నింగ్ యిచ్చింది బిరాట్టి.

రామరావణ యుద్ధం పవర్ కోసమే జరిగింది. నేనే లంకాధిపతినంటాడు రావణుడు. నేను యెన్నికలలో పాల్గొని మెజారిటీ సంపాయించిందీ లంకాధిపతిని కావటానికే అంటాడు రాముడు. నువ్వు నా ప్రతినిధివే. హోంమంత్రివే అని నవ్వుతాడు. విభీషణుడు ప్రతినిధే అయినాడు.

పెద్ద విచిత్రమేమిటంటే, పవర్లో లేకుండానే, యెన్నికలకు నిలబడకుండానే, జాతీయపిత పవర్‌ఫుల్ అయి, పవర్ని గుప్పెట్లో పెట్టుకున్నాడు.

దత్తా నవ్వుతూ చూశాడు.

''కాని బిరాట్టి అమ్మా! పార్టీ కోసం యెక్కువగా ఫండ్స్ సేకరించింది నేనే. నేనాపని ఆపేశానా కోశం బలహీనమౌతుంది. నువ్వు సమర్థులు కాని వాళ్లను నమ్ముతూ పార్టీ నిధులను వారి కందజేస్తున్నావు. నువ్వూ మేల్కోవాలి'' అని హెచ్చరించి వెళ్లిపోయాడు.

యేమన్నాడో దత్తా పుత్రరత్నం సరిగా అర్థం చేసుకోలేదు సీతాబిరాట్టి.

తన పతనానికి కారకుడౌతాడని భయపడింది. యెమర్జన్సీ పెట్టినట్టు ఆంక్ష

పెట్టింది. తన లిఖితపూర్వకమైన అనుమతి లేనిదీ దత్తా యేమీ చేయగూడదు.

''ఆ కొత్తసభ్యురాలినీ, దాని వారినీ తరిమేయాలి. వారికేమీ అందకుండా చేయాలి'' అనుకున్నది బిరాట్టి.

పాల సముద్రం చిలికి అమృతం తీసినట్టు, మనస్సును మథించి గొప్ప అయిడియా పైకి తీసింది. అమృతం వంటి దానిని తన వారికి పంచింది.

''దత్తాని మీరంతా కనిబెట్టి వుండండి. వాడి మీదో కన్నుంచండి. విడిపోయే పనులకు సహాయపడద్దు'' అని డిక్రీ యిచ్చింది బిరాట్టి.

విప్పు అధికారమూ పనిచేయలేదు. తన పార్టీ పల్చబడుతున్నది అని గమనించింది బిరాట్టి. దత్తా చేయి జారిపోతున్నాడని తెలిసి, పవర్లో లేకుండా చేయాలని శాసనసభ డిజాల్వు చేసింది బిరాట్టి.

''సుపుత్రుడు దత్తా మళ్లా యెన్నికలకు నిలబడాల్సిందే'' అని వూరట పొందింది.

''నా కార్యక్రమం పూర్తికాకముందే సభను డిజాల్వు చేసిందే బిరాట్టి తల్లీ! పోనీ చేయనీ. చట్టం లేకపోయినా, రక్షణ లేకపోయినా, మద్దతులాగేసి గద్దె దింపినా, యెన్నికలు రావాల్సిందే గదా. గెలవాలి. ఇదీ మనమంచికే. బిరాట్టి తల్లికి, యెంత ప్రజాభిమానం, ఛారిస్మా వున్నాయో తేలిపోతుంది. మధ్యంతర యెన్నికలు మనమంచికే అనుకుందాము. సీతాదేవి రామునికి అడ్డు రాగలిగిందీ? మొండిగా వెంటబడి అరణ్యవాసానికి వెళ్లిందిగానీ నష్టపోయింది. మళ్లా రాముడే విముక్తి కలిగించాడు. కలిగించాల్సి వచ్చింది. చివరివరకు అయోధ్యలో సింహాసనం మీద వున్నది రాముడే. సీతాదేవి వాల్మీకి ఆశ్రమంలోనే వుండాల్సి వచ్చింది'' అని నవ్వుకున్నాడు దత్తా మధ్యంతర యెన్నికలకు థట్టీ బిగించాడు.

పవర్ అనేది యెల్లప్పుడూ ఒకరినే నిలబెట్టదు. మనుషుల్ని మారుస్తుంది ఇంద్రుడూ పవర్ కోల్పోయాడు. అది గౌతముని శాపం.

లక్ష్మికి భర్త వైకుంఠుడు. దరిద్ర నారాయణుడైనాడు గాదా.

సీతాబిరాట్టి తల్లికి పవర్లో వుండాలనేదే అభిలాష. అది నిలబెట్టుకోటానికేమైనా చేస్తుంది. నేను బిరాట్టి కొడుకునేగా. తక్కువ తిన్నానా? అని నవ్వుకుంటూ మధ్యంతర యెన్నికల్లో పాల్గొని నిలబడి గెలిచి తీరాల్సిందేననీ తానే పార్టీ పెద్ద కావాలనీ తీర్మానించుకున్నాడు.